# ఆభరణాలు

—వి. ఎం. ఎస్. స్వాతి

నిరంజని గుడ్లనీరు కుక్కుకుంటూ ఆభరణాలు నాచేతి కందిస్తుంటే ఆమె చేతులు వణికాయి. పుట్టింటి నుండి తెచ్చుకున్నవి. అలాంటివి నేను మళ్ళీ చేయించడం కలలో మాటే!

పోనీ వడ్డీకి పెట్టి డబ్బు తెచ్చుకుందామన్నా, నెలనెలా వడ్డీలకే నా జీతం సరిపోతుంది. ఇంక ఇల్లు గడిచేదెలా? ఆ ఉద్దేశంతోనే నగలను అమ్మడానికే నిర్ణయించుకున్నాను.

మా పెద్దబ్బాయికి చదువు నిమిత్తంగా ఇప్పటికే తెలిసినచోటల్లా చేసిన అప్పులు ఎల్లలు దాటాయి. ఇక ఇచ్చే నాధుడే కానరావడం లేదు.

అదీగాక పెద్దపండగ దరిదాపులో ఉంది. ఆడపిల్లలకు కొత్త బట్టలు తీయాలి ఇతరత్రా అవసరాలకూ వెలిసి ఇప్పుడు నేను చేస్తున్న పని నిరంజనికే కాదు. నాకూ బాధామయంగానే ఉంది. ఆవిడ ఆభరణాల తాలూకు గత స్మృతులు కళ్ళముందు మెదిలాయి.

* * *

రాహుల్ పెళ్ళవుతూంటే, వాడి పక్కన తోడిపెళ్ళికొడుగ్గా నేను ఉండవలసి వచ్చింది ఆడా-మగా తేడా లేకుండా అందరితో కలుపుగోలుగా మాట్లాడుతున్నాను. జిలేబీలు, కూల్ డ్రింకులూ తిన్నన్నీ తాగినన్నీ!

అడ్డుకునే దమ్మెవరికీ? అందునా అది ఆడపెళ్ళివారిల్లు. నేను వారికి కాబోయే అల్లుడి పక్కన నన్నేమైనా అంటే ఎక్కడ అల్లుడికి కంప్లయింటు చేస్తుందో అని వాళ్ళ భయం. ఆ బ్లాక్ మెయిల్ ఉద్దేశ్యమే నేను ఆడింది ఆట, పాడింది పాట!

ఆమె పెళ్లికూతురు చెల్లెలని నాకు తెలియదు. కళ్ళకు నదురుగా మనసుకు కుదురుగా కనిపించేసరికి నాలో కలవరం మొదలైంది.

'ఏయ్ పిల్లా!' అన్నాను నా దారికి అడ్డుగా గుమ్మంలో నిల్చొనుంటే.

'ఏంది పిల్లోడా!' నాకేసి మళ్ళీ కళ్లు ఎగరేసింది.

ఎగాదిగా చూశాను ఒకటికి రెండు

మార్లు. పెద్ద ఫోజేసింది అమ్మడు. 'చూసుకో నా సిగ్గూ, వేసుకొచ్చావా ఓ పెగ్గూ, సోగ్గాడివైతే మాత్రం నాదగ్గరొద్దు నీ మొగ్గూ...' అన్నట్లుగా

'నే నెవరనుకున్నావ్, ఈ ఇంటికి కాబోయే అల్లుడి బెస్ట్ ఫ్రెండుని చందనం కావాలి, మావాడికి తాపంగా ఉందట' ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాను

'అహాఁ తాపం తొలిరేయిదాకా అట్టే పెట్టుకోమను మీ ఫ్రెండును. మరీఅంత తొందరైతే ఎలా మా అక్కయ్యతో' ఏదో చెప్పబోయి నాలుకక్కొరుచుకుని మాట దాటేసింది తడబాటుగా

'పెళ్లికూతురుతో చెప్తాలే...'

'మా స్నేహితుడికి విరహతాపంకాదు బుల్లెమ్మా! ఎండవేడిమి తాపం...' కొంటెగా నవ్వేశాను.

తొందరపాటుగా అపార్థం చేసుకున్నందుకు సిగ్గుపడింది తలతిప్పి ఎవరినో కేకేసి 'చందనం తెచ్చి ఈ అబ్బాయికి ఇవ్వు' పురమాయించి జారుకుంది.

'మాంగల్యం తంతునానేన 'సందర్భంలో వధువుపక్కనే తటస్థించింది మరోసారి.

'అకయ్యా జడ సర్దమ్మా!' ఎవరో అంటూంటే తనకేసి ఆశ్చర్యంగా చూసాను. తన చూపులూ అప్పుడే నన్ను చుట్టుముట్టాయి

'మా అక్కయ్యతో...' అంటూ మధ్యలో మాట దాటేయాల్సిన కత యేమిటా అన్న సంశను భోజనాల దగ్గర కదిపాను

'నువ్వు సరే తోడిపెళ్లికొడుకువని డబ్బా వాయిస్తూ అటూఇటూ తిరుగుతున్నావా? నేను పెళ్లికూతుఖ చెల్లెల్ననిమగపెళ్ళివారందరికీ డబ్బా వాయిస్తే ఎంత దిష్టనుకున్నారూ! చూశావా నా వడ్డాణం, మెడలో చంద్రహారం, చెంపసరాలూ అన్నీ తీసేసి ఓ మూలన తలనొప్పితో ఎలా పడుకోనూ...'

'చమత్కారివే?' ఆవిడ వెళుతూన్న దిక్కుకేసే చూస్తూండిపోయాను

మరవళ్ళదగ్గర తటస్థపడగా ధైర్యం చేసి అడిగేశాను కోసమెదుపుగా 'ఆలోచించుకునే చెప్పు ఫర్వాలేదూ! ఇదీ నా అడ్రసు కాగితం...'

'సూదిబెజ్జమంత చనువిస్తే ఏనుగులనే దూరనిస్తున్నావే-ఘటికుడివే...' ముఖం ప్రసన్నత చూస్తేనే అర్థమైంది నేనంటేనే ఇష్టపడుతుందని.

అటుకేసి ఎవరో వస్తూంటే గబగబా అడ్రసుకాగితం బ్లౌజులో దాచుకున్నది.

తర్వాత పెళ్ళిళ్ళ లగ్నానికే కథ సుఖాంతం!

* * *

'ఏమండీ' అలాగే నిలబడిపోయారేం..' నిరంజని కదుపుతుంటే ఆలోచనల నుండి తేరుకున్నాను.

నగల మూట జేబులో కుక్కుకుని భారంగా వీధిలోకి అడుగులేస్తూండగా వెనుక నుంచి 'అగర్భశ్రీమంతులనే వీటిని అట్టేపెట్టుకోవడం ఒక్కోసారి వీలుకాదు, లక్ష్మి చపలచిత్తురాలు మన లాంటి మధ్యతరగతికి ఇలా ఉపయోగపడడానికే ప్రత్యేకించి ఇవున్నదీ...' నిరంజని సణుగుడు నా చెవిని పడింది